# మరో మాస్వాతి

— టి. రామాచారి.

తన బల్ల మీదున్న ఫోను మోగడంతో మోహన్ ఇంటర్నేషనల్ జనరల్ మేనేజర్ రిసీవర్ని అందుకుని "రామ్మోహన్ హియర్" అనంటే అవతలి గొంతు "గుడ్ ఆఫ్టర్నూన్ టు యు. నేను గాంధీ హాస్పిటల్ నుంచి డాక్టర్ అరుణని మాట్లాడుతున్నాను. ఈ రోజు ఉదయం ఎవరో ఒక స్త్రీని తీసుకొచ్చి మా హాస్పిటల్లో చేర్పించారు. ఇంతవరకూ ఆమె అపస్మారకంలో ఉన్నా ఇంత క్రితమే తెలివి వచ్చి ఇప్పుడు కొద్ది కొద్దిగా మాట్లాడుతోంది. ఆమెది బొంబాయట. మీ పేరు చెబుతోంది."

"డాక్టరుగారూ! మీకు కావలసింది మరో రామమోహన్ అయి ఉండవచ్చు. నేను మోహన్ ఇంటర్నేషనల్ అనే ఎక్స్‌పోర్ట్ కంపెనీ జనరల్ మేనేజర్నండీ.."

"ఆ పేషెంటు చెబుతోందీ ఈ కంపెనీ పేరే. మోహన్ ఇంటర్నేషనల్స్, ఆర్.పి. రోడ్, సికింద్రాబాద్ నుంచే కదా మాట్లాడుతోంది?"

"అవునండీ!"

"అయితే మీరు స్పెషల్ వార్డు రూం నంబర్ సిక్స్‌లో ఉన్న పేషెంటుని కలుసుకోండి" అని ఫోన్ పెట్టేసింది డాక్టర్.

సాయంత్రం అవుతూనే హాస్పిటల్‌కి వెళ్ళడానికి బయలుదేరిన రామ్మోహన్‌కి తను చేసిన తప్పొకటి జ్ఞాపకం వచ్చింది. ఏమంటే. డాక్టర్ అరుణని ఆ పేషెంటు పేరు అడగడం మరిచిపోయాడు. కాని ఇప్పుడు దాని గురించి అనుకుని ఏం లాభం. తనిప్పుడు ఎలాగూ అక్కడికే వెడుతున్నాడు. హాస్పిటల్ చేరుకుంటూనే స్పెషల్ వార్డుకు వెళ్ళి అక్కడి ఆరో నంబర్ గది తలుపు తడుతూనే 'కమిన్' అన్న మాటలు వినిపించాయి. లోపల బెడ్ మీద పడుకున్న వ్యక్తిని చూస్తే ఆమె తను ఎరుగున్న వ్యక్తిలాగే కనిపించింది. ఎవరా అని ఆలోచిస్తే అతని మెదడులో ఒక్క మెరుపు మెరిసి ఆమె ఎవరో అర్థమైపోయింది.


ఎవరో కాదు. మైత్రేయి! అవును మైత్రేయే! తన చిన్ననాటి స్నేహితురాలు. స్కూల్లోనూ, కాలేజీలోను తనతోపాటు చదువుకున్న మైత్రేయి. మైత్రేయే! కానీ ఇదేమిటీ? ఉన్నట్టుండి ఆమె ఈ హైదరాబాదు రావడ మేమిటి? తనను ఇంత ఆశ్చర్యపరచట మేమిటనిపించింది అతనికి.

"మైత్రేయీ!"

"అవును రామ్. నేనే, కూచో" అని అక్కడే ఉన్న కుర్చీ చూపించింది.

"ఏమిటి? ఏమైంది మైత్రేయీ?"

"ఈ రోజు పొద్దుటే హైదరాబాదు స్టేషన్‌లో బొంబాయి రైలు దిగుతూనే కళ్ళు తిరుగుతున్నట్టయి పడిపోతే దారినపోయే వాళ్ళెవరో తెచ్చి ఇక్కడ చేర్పించి పోయారు. నీ అడ్రసు తెలుసు గనుక సరిపోయింది. నీకు ఇబ్బం దేమీ కాలేదు గదా?"




"అబ్బే అదేం లేదు.." అన్నాడే గాని అతని మనస్సులో 'నా అడ్రసు నీ కెలా తెలుసు మైత్రేయీ? అసలు నీ కేమైందోచెప్పు' అని అడగాలనుంది. కాని ఇప్పుడు అడిగితే బాగుండదని ఊరుకుండిపోయాడు. ఆమె దగ్గర ఒక అరగంట కూచుని బయటకొచ్చి చూస్తే ఎదురుగా స్టాఫ్ నర్సుల గది కనిపించింది. అందులో ఉండే హెడ్ నర్స్ ఫిలోమినా అతనికి తెలుసు. ఇతన్ని చూసి ఆమే మొదట - "హలో సర్!" అంటూ బయటి కొచ్చింది.

"గుడ్ ఈవినింగ్ సిస్టర్. హౌ ఆర్ యూ?"

"ఏమి టిలా వచ్చారు?" అనడిగింది.

అతను మైత్రేయి విషయం చెప్పి - "అసలు ఏమిటి కంప్లయిం టామెకు?" అనడిగాడు.

"ఆమె డాక్టర్ అరుణగారి పేషెంటు. మీ రొకసారి ఆమెను కలుసుకోండి" అం దామె.

సరే, అతను డాక్టర్ అరుణ గదిలో కెళ్ళి తనని తాను పరిచయం చేసుకుని మైత్రేయికి ఏమైందని అడిగితే ఆమె నిష్ఠురంగా - "చూడండి! ఏమైందని ఇప్పు డడిగితే ఏం ప్రయోజనం చెప్పండి. మొదటి నుంచీ బాగా అశ్రద్ధ చేశారు. ఏం చెయ్యటానికైనా ఇప్పుడు పూర్తిగా మించిపోయింది."

"డాక్టర్! అస లామెకు..."

"ఆమెకు లంగ్ కేన్సర్. చాలా అడ్వాన్స్‌డ్ స్టేజీ" అంటూ స్టెతస్కోపును మడిచి తన తెల్లకోటు జేబులో పెట్టుకుంటూ లేచింది - ఇక తను వెళ్ళాలన్నట్టుగా. ఆమెకు 'థాంక్స్' చెప్పి బయటకు నడిచాడు రామ్మోహన్.

ఇంటి కెడుతుంటే అతనికి మైత్రేయి గురించిన ఆలోచనలే. ఏది ఏమైనా సాధ్యమైనంతవరకూ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచా లనుకున్నాడు.

ఉన్నపళంగా చెప్పా పెట్టకుండా వచ్చి ఇలా రామ్మోహన్‌ని ఉక్కిరి బిక్కిరి చేయడం మైత్రేయి కిది మొదటి సారేం కాదు. ఇంతకు ముందు కూడా ఒకసారి ఇలాగే చేసింది. - ఓ పది పన్నెండేళ్ళ క్రితం - అప్పుడూ ఇలాగే ఉన్నట్టుండి అతని ఆఫీసు కో టెలిగ్రాం కొట్టింది - తను ఫలానా తేదీన హైదరాబాదు వస్తున్నాననీ, వచ్చి స్టేషన్‌లో కలుసుకోమనీ - ఆ టెలిగ్రాం చూసి అపుడూ ఇలాగే ఆశ్చర్యపోయా డతను.


ఆ టెలిగ్రా మిచ్చింది ఎవరా అని ఆలోచిస్తూ "ఎవ రీ మైత్రేయి? ఆమెను నే నెప్పుడూ చూసినట్టు లేదే? పోనీ ఎవరైతేనేం. రమ్మన్న తేదీకి

స్టేషను కెడితే సరి" అని అప్పుడూ ఇప్పటిలాగే సరిపుచ్చుకున్నాడు.

సరే, ఆమె రమ్మన్న తేదీన హైదరాబాద్ స్టేషన్‌కు వెళ్ళాడు. బొంబాయి నుంచి వచ్చి ఎక్స్‌ప్రెస్‌లో ఎయిర్ కండిషన్డ్ కంపార్ట్‌మెంట్‌లోంచి దిగిన ఒక స్త్రీని చూసి ఈమె నెక్కడో చూసినట్టుందే. ఈమే మైత్రేయి కాదు గదా అని అనుకుని అక్కడే నిలబడి పోయాడు ఆమెను చూస్తూ. అత నూహించినట్టే ఆమే మైత్రేయి. కాని అప్పటి మైత్రేయికీ, ఇప్పటి మైత్రేయికీ పోలికే లేదు. ఆమె ఇప్పు డెంతో మారిపోయింది.

చదువుకునేప్పుడు వీళ్ళ సాన్నిహిత్యం చూసి వీళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటా రనే అనుకున్నా రందరూ. తనూ అలాగే అనుకున్నాడు మరి. చదువైపోయి ఉద్యోగంలో చేరిన తర్వాత ఇక జీవితంలో స్థిరపడిపోదామని అనుకుని తమ వివాహం గురించి మైత్రేయిని అడుగుదామని అనుకున్నాడు. కానీ ఇంతలోనే ఆమె మురళీధర్‌ని పెళ్ళి చేసుకుని ఆతనితో అమెరికా వెళ్ళిపోయింది. మురళి సంపన్న కుటుంబంలో పుట్టినవాడు. ఇంజనీరింగ్ పూర్తి చేసి అక్కడున్న ఒక పెద్ద సంస్థలో ఉద్యోగ మొస్తే అమెరికా వెళ్ళా డతను మైత్రేయితో సహా.

మొదట్లో వాళ్ళ వైవాహిక జీవితం సజావుగానే సాగింది. కాని రోజులు గడిచే కొద్దీ వాళ్ళిద్దరి మధ్య సఖ్యత సన్నగిల్లుతూ వచ్చింది. అభిప్రాయ భేదాలు అధిక మయ్యాయి. వాళ్ళ సంసార జీవితం అయి దారేళ్ళు సవ్యంగా సాగిందో, లేదో విడాకు లిచ్చుకున్నారు. అప్పటికి పిల్లా, జెల్లా లేరు గనుక విడిపోవట మేమంత కష్ట మనిపించలేదు. ఆ తర్వాత కూడా మైత్రేయి కొంతకాలం ఒంటరిగానే ఉంది అమెరికాలో. కాని



రోజు రోజుకీ ఆమెలో అస్థిరత్వం, అసహనం ఎక్కువ కాసాగింది. చివరికి ఇండియా తిరిగి వచ్చేసింది. వచ్చి బొంబాయిలో స్థిరపడింది. అక్కడే ఒక ఇల్లు కొన్నది. దొరికిన ఉద్యోగం చేస్తూ వచ్చింది.

కానీ ఉన్నట్టుండి తమ పూర్వ స్నేహాన్ని పురస్కరించుకుని రామ్మోహన్‌కి ఒక టెలిగ్రామ్ ఇచ్చింది. ఇచ్చి హైదరాబాద్‌లో వాలింది. అత న్నిలా ఇబ్బంది పెట్టింది. అతను రైల్వే స్టేషన్‌కైతే వెళ్ళాడు కాని తీరా ఆమెని కలుసుకున్నాక "ఇప్పుడు ఏం చేయాలి?" అన్న ప్రశ్నకి చప్పున సమాధానం చెప్పలేకపోయాడు. ప్లాట్‌ఫారం మీద తొలి పలకరింపు లయిన తర్వాత అత నో నిర్ణయాని కొచ్చాడు. ఆమెను నేరుగా తీసుకెళ్ళి ఓడియన్ హొటల్లో బస చేయించాడు. రోజూ సాయంత్రం వేళ వచ్చి కలుసుకుంటూ ఉన్నాడు. అపుడే చెప్పిం దామె సవివరంగా తన వైవాహిక జీవితం విచ్ఛిన్నమైన సంగతి. ఇప్పుడు తను స్వతంత్రురాలిననీ, దేశం నలుమూలలా తిరుగుతున్నా ననీ. తనతోపాటు అతన్ని రమ్మనీ బలవంతం చేసింది. కానీ కుదరదని అతను తప్పించుకున్నాడు.



ఆ చీకటి గదిలో
నా వ్రేళ్ళూ నీ వ్రేళ్ళూ
నిమురుకున్నప్పుడు
అనంతానంద వృక్షపు
కూకటివ్రేళ్ళు తాకి నట్లనిపించింది
చర్మం చర్మం తాకితేనే
సర్మగర్భం గగుర్పొంది గదా

మరి మన సశరీరాత్మలు
ప్రేమ స్తంభం చుట్టూ
పెనవేసుకుంటే
ఆకాశపు టంచులే
మన నయనాంచలాలైపోవా?

మన స్పర్శకు కూడా
దర్శనాసక్తి ఉంది
మన హృషీకాలకు
ఆనందబ్రహ్మ
వశీకరణశక్తి ఉంది

అందుకే మన నిమిష మాత్రపు
పొందులో
అనిమిషత్వ ముంది
హృదయేశ్వరీ ! మన ప్రణయతత్వంలో
అనశ్వరత్వం ఉంది.

# ప్రేమ స్తంభం

డా. జె. బాపురెడ్డి

ఒక సాయంత్రం అతను మామూలుగానే మైత్రేయిని కలవడానికి ఓడియన్‌కి వెడితే ఆశ్చర్యం! గది ఖాళీ చేసి ఆమె పొద్దునే వెళ్ళిపోయింది. ఎక్కడి కెళ్ళిందో ఎవరికీ చెప్పలేదు. అసలు ఆమె మనస్తత్వమే అంత. స్వతంత్ర భావాలున్న వ్యక్తిత్వం ఆమెది. ఒకరి అదుపాజ్ఞల్లో ఉండి వాళ్ళు చెప్పినట్టే వినే మనిషి కా దామె. తన జీవితాన్ని తనే దిద్దుకునే హక్కు తనకు ఉందని వాదించేది. తన జీవిత భాగస్వామిని తనే ఎన్నుకుని పెళ్ళాడి, అతని శాసిస్తూ జీవితాన్ని గడపగల సామర్థ్యం తనకుం దనే గట్టి నమ్మకం ఆమెకు ఉండేది.

పోనీ ఇలా ఉన్నా బాగుండేది. కాని రాను రాను ఆమెలో స్వార్థం ఎక్కువవటం మొదలైంది. పైగా తనకెవరూ సాటి రారని, అందరికన్నా తనే మిన్న అన్న గర్వం వంటబట్టడం మొదలైంది. తను చేస్తున్న పనులు ఇతరులకి ఎంత ఎబ్బెట్టనిపించినా, ఎదుటి వాళ్ళను ఎంతగా బాధిస్తున్నా ఆమెకు మాత్రం అవి అతి మామూలుగా కనిపించేవి. విడ్డురమేమంటే తన కోసం ఇతరులు కష్టపడటం వాళ్ళ బాధ్యత - అనే అపోహ ఆమెకుండేది. ఎందుకూ అనంటే దానికి సరైన సమాధానం చెప్పలేకపోయే దామె. కాని అదేం చిత్రమోకాని ఆమె అనుకున్నట్టుగానే అన్నీ సమకూరేవి ఆమెకు. ఆమె ప్రతి మాటా సాగేది. అదే విచిత్రం మరి.

అప్పు డామె ఈ హైదరాబాద్‌కు ఎంత అనుకోకుండా వచ్చి రామ్మోహన్‌ని ఇబ్బంది పెట్టిందో, అంత అకస్మాత్తుగానూ వెళ్ళిపోయింది. అ దెప్పుడో ఓ పది పన్నెండేళ్ళ క్రితం కనుక మైత్రేయిని ఇప్పుడు అతను చప్పున గుర్తించలేకపోయాడు.

వయస్సులో ఉన్నప్పుడు ఆమె గురించి అత నెంతో ఆలోచించేవాడు. తన మస్తిష్కంలోంచి లేచే ఆలోచనల్లోంచి పువ్వుల్లాంటి సున్నితమైన పదాల్ని ఏరి ఒక్కోదాన్నే తన మనస్సుకు సంధించి ఆమె వైపుకి విడిచేవాడు. వాటి స్పర్శకు ఆమె తన ప్రేమ పాశంలో చిక్కుకుని ఆనందంతో చిరు కేకలు వేస్తుందని ఆశించేవాడు. కాని అలాంటి దేమీ జరక్కపోగా ఆమె ఒక జడపదార్థమని అర్థం చేసుకున్నాడు. ఆమె మానవ రూపంలో ఉన్న ఒక మాను. అతి సుందరంగా మలిచిన ఒక చెక్క బొమ్మ. హృదయ ముండవలసిన చోట చెక్క పీట ఉన్న ఓ అప్సర. ఇన్ని తెలిసినా అతను మాత్రం ఆమె హృదయం తన ప్రేమకు ఎప్పుడో ఒకప్పుడు స్పందిస్తుం దనే ఆశించాడు. ఆమె హృదయంలో ఏ మూలో రవంత భాగమైనా సచేతనంగా ఉంటుందనీ, దానికి ప్రేమించగల శక్తి ఉందనీ, తను సంధించే ప్రేమ పుష్పాలు దానికి తాకి అది సచేతనం కాగలదనీ అనుకున్నాడు. కాని అవన్నీ వమ్మే అయ్యాయి.

ఆ రోజు కూడా రోజూ మాదిరే రామ్మోహన్ హాస్పిటల్‌కి వెళ్ళాడు. అప్పటికే ఆమె తన కోసం ఎదురు చూస్తోంది. అతన్ని చూస్తూనే ఆమెకు తన మీద నుంచి ఏదో బరువు దిగిపోయి నట్టనిపించి తేలికగా ఒక శ్వాస తీసుకుంది. అతను "ఏమి

టిలా ఉన్నారు?" అని అడిగితే ఆమె "నీతో ఒక ముఖ్యం విషయం చెప్పాలి. నే నిక ఎన్నో రోజులు బ్రతకనని నీ కిదివరకే తెలుసుంటుంది. ఈ విషయం నాకు తెలియదని నీ వనుకుంటే అది నీ అమాయకత్వమే. అది సరే ఇప్పుడు నీవు నా తుది కోర్కెను తీరుస్తానని మాటివ్వాలి. బొంబాయిలోని మహీమ్‌లో కృష్ణ అనే ఓ కుర్రా డున్నాడు. ఇప్పుడు నా కిక్కడ ఏమైనా అయితే వాడితోనే నాకు కొరివి పెట్టించాలి. ఇదిగో వాడి అడ్రసు" అని ఒక కార్డు ముక్కని అతని కందించింది.

రామ్మోహనరావుకి ఆశ్చర్యమేసింది. తను చనిపోతానని ఈమెకు తెలుసా? ఈమె కెంత గుండె నిబ్బరం. చనిపోతానని తెలిసీ ఎంత ధైర్యంగా ఉందీమె. పైగా తన దహన సంస్కారాలు ఫలానావాడే చేయాలి అనే వింత కోరిక కోరడ మేమిటి? అయినా ఎవరా కుర్రాడు? వాడు ఈమె కేమవుతా డు?

అతని మనస్సులో ఇన్ని ఆలోచనలున్నా పైకి మాత్రం "మీ కేమీ కాదు. మీరు అనవసరంగా ఎక్కువగా ఆలోచిస్తున్నారు. అయినా మీ మాటను నే నెప్పుడు కా దన్నాను? మీ ఇష్ట ప్రకారమే చేయిస్తాను. కాని మీరు కొంచెం విశ్రాంతి తీసుకోండి. మళ్ళీ రేపొచ్చి కలుస్తా" అని లేచాడు.

మొదటి నుంచి మైత్రేయి తనని ఎంతో చనువుతో ఏకవచన ప్రయోగం చేస్తూ పిలుస్తున్నా అతను మాత్రం మర్యాదగా మాట్లాడుతూ ఆమె గౌరవాన్ని నిలుపుతూ ఉన్నాడు. ఎందుకోగాని ఆ రోజు అతను లేచి వచ్చేప్పుడు ఆమె చప్పున అతని చేయి పట్టుకుని అతని కళ్ళలోకి దీనంగా చూసింది. ఏదో చెప్పబోయింది గాని పెదాలు వణికి ఒక్క మాట కూడా బయటకు రాలేదు. మరో చేత్తో అతని ముంజేతిని తడుతూ "రామ్.." అని అన్నదే గాని తను చెప్పా లనుకున్నది మాత్రం చెప్పలేకపోయింది. తన కళ్ళలోకి గుచ్చి చూస్తున్న ఆమె కళ్లలో ఎర్రటి జీరలు, ఏదో భయం, నిస్సహాయత. హృదయంలోంచి పైకి తన్నుకొచ్చిన నీళ్ళు కను కొలకుల్లో ఆగిపోయాయి.


ఆమె బాధేమిటో అర్థం కావటం లే దతనికి. అంత భరించరాని బాధను గుండెలో దాచుకునే బదులు తనకు చెబితే బాగుండు ననిపించిం దతనికి. తనూ ఏదో అనబోయాడు గాని అనలేకపోయాడు. ఆమె చేతిని మెల్లిగా విడిపించుకుని "మళ్ళీ రేపు" అని బయటి కొచ్చాడు. అతనలా అడుగు బయట పెడుతూనే ఆమె కనుకొలకుల్లో ఆగిన నీరు జలజలా కిందకు రాలిపోయాయి.

ఆ రోజు రాత్రి పడుకున్నాడే గాని రామ్మోహన్‌కి నిద్ర రాలేదు. మైత్రేయి గురించిన జ్ఞాపకాలే అతని వ్యక్తిత్వాన్ని ఆవరించా యా రోజు. ఆ రోజే కాదు మర్నాడూ అంతే. ఎర్ర జీరలతో నిండిన ఆమె కళ్ళు, ఆమెలో ఏదో అర్థం కాని భయం. తను లేచి వచ్చేప్పుడు తన చేతిని పుచ్చుకుని ఆమె అన్న ఒకే ఒక మాట, చూసిన ఒకే ఒక్క చూపు. ఇవే అతన్ని నిరంతరం వెంటాడుతున్నాయి. వీటిని భరించలేక తొందరగా హాస్పిటల్‌కు బయలుదేరాడు. పోయి చూస్తే ఆమె గది తాళం వేసుంది. సిస్టర్ ఫిలోమినాను కలుసుకుని అడిగితే మైత్రేయి ఆ మధ్యాహ్నామే చనిపోయిందని, శవాన్ని మార్చురీలో ఉంచారనీ, ఆమె సామనులు ఆర్.ఎం.వో భద్రపరిచారనీ చెప్పింది. ఇది ఊహించిన విషాదమే అయినా ఈ పరిస్థితి ఇంత త్వరగా ఎదురవుతుందని అత ననుకోలేదు.

సరే ఆర్.ఎం.ఓను కలుసుకుని తను బొంబాయి వెళ్ళి వచ్చేంత వరకూ శవాన్ని మార్చురీలోనే ఉంచమని, ఆమె లగేజిని కూడా తమ దగ్గరే ఉంచమని చెప్పి విమానంలో బొంబాయి వెళ్ళాడు రామ్మోహన్. అక్కడ మహీమ్‌లో మైత్రేయి ఇచ్చిన అడ్రసు వెతుక్కుంటూ పోయి చూస్తే అదొక చిన్నసైజు మెస్. అందులో ఉన్న కృష్ణ అనే అబ్బాయిని కలుసుకుని అతనికి మైత్రేయి గతించిన విషయం చెప్పి హైదరాబాదు వచ్చి ఆమె దహన సంస్కారాలు చేయమంటే, వాడు మైత్రేయి తనకు సవతి తల్లి అని, ఆమె బాధ్యత తనకేమీ లేదని, తను రానని చెప్పేశాడు. రామ్మోహన్ అతనికి ఎంతో నచ్చజెప్ప ప్రయత్నించాడు కాని ఆ కుర్రవాడు మరింత బిగుసుకుపోయి సహకరించ నిరాకరించాడు. పైపెచ్చు ఆమెను నానా మాటలూ అన్నాడు. మైత్రేయికి విడాకు లిచ్చిన తర్వాత మురళీధర్ మరో పెళ్ళి చేసుకుంటే ఆ రెండవ భార్యకు పుట్టిన వాడే కృష్ణ. ఎందుకోగాని మరి వీ డొక్కడే ఇండియా వచ్చేసి ఒంటరిగానే బొంబాయిలో ఉంటున్నాడు. తన సవతి తల్లీ ఆ మహానగరంలోనే ఉంటున్నా వా డామెను ఒక్కసారైనా కలుసుకోలేదు. ఆమె చనిపోయిన తర్వాత అంతిమ సంస్కారాలు చేయ నిరాకరించాడు. వాడి సంస్కారమే అలాంటిదేమో మరి?

ఇక చేసే దేం లేక రామ్మోహన్ హైదరాబాద్ తిరిగొచ్చి ఆర్.ఎం.ఓ.ను కలుసుకుంటే ఆయన మైత్రేయి లగేజిని అప్పజెప్పి ఆమె శవాన్ని ఇచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేశాడు. ఆ లగేజీని తీసుకుని రామ్మోహన్ ఏకాంతంగా ఒకచోట కూచుని అసలందులో ఏమున్నాయో చూడటానికి ఒక్కోదాన్నే విప్పటం మొదలు పెట్టాడు.

ఒక దాంట్లో మామూలుగానే ఉండే బట్టలూ, బెడ్ షీట్లూ ఉన్నాయి. మరో దాన్లో స్నో పౌడర్, క్రీం, అద్దం మొదలైనవి ఉన్నాయి. మరో దాన్ని విప్పి చూస్తే అతనికి రవ్వంత విస్మయమేసింది - ఇతర చిల్లర సామానులతోపాటు సీలు వేసిన మూడు కవర్లు కనిపించా యందులో. ఏమిటి అని చూస్తే ఒకదాని మీద తన పేరు రాసుంది - ఇదేమిటని దాన్ని విప్పి చూస్తే అందులో ఒక డైరీ ఉంది. దాని పేజీలను తిరగేస్తే ఆమె అప్పుడప్పుడూ తన వ్యథని అందులో రాసుకుందని అర్థమయింది.



## క్రాంతి పతాక

వేముగంటి నరసింహాచార్యులు


చీకటి సంకెళ్ళను తెంచి
చిక్కుల నొక్కులను తుంచి
నిరుపేదల శిరము మీది
కరువు బరువు తొలగించు

మమతకు చిన్నెలుగా
సమతకు వన్నెలుగా
మానవతకు రూపాలై
మానవతకు నిక్షేపాలై

కాంతి కృపాణం దూస్తూ
క్రాంతికి ప్రాణం పోస్తూ
చైతన్య ప్రతీకలుగా
జ్యోతిః పతాకలుగా
వెలగాలి తాపాలు

వాడ వాడలో
నాడు నాడులో
వెలుగు అలుగులు దూకాలి
విద్యుల్లతలు పాకాలి

★



## బీ.పీ.

"నీ బీపీ పెరగడానికి, ఆటోలో వెళ్ళడానికీ ఉన్న సంబంధమేమిటో నా కర్థం కావడం లేదు" వరాంకుశంతో అన్నాడు పరంధామయ్య.

"ఏముంది? ఆటోలో మినిమమ్ ఛార్జీ దాటి పది గజాలకి పది పైసల చొప్పున పెరుగుతూంటే, అది చూసి నా బ్లడ్ ప్రెషర్ దానికి రెట్టింపు వేగంతో పెరుగుతుంది." అసలు విషయం చెప్పాడు వరాంకుశం

ఐరేని శ్రీనివాస్‌గౌడ్

మరో కవర్ని చూస్తే దానిమీద "శ్రీమతి రామ్మోహన్, హైదరాబాద్" అని ఉంది. ఇదేమిటి? తన భార్య నీమె అసలు చూడనైనా చూడలేదే! అలాంటిది ఈ కవర్ని తన భార్య పేరిట రాయటమేమిటని అనుకుంటూ దాన్ని విప్పితే ఆశ్చర్యం. అందులోంచి నోట్ల కట్టలు బయటపడ్డాయి. కొన్ని క్షణాలు వాటినే చూస్తూ ఉండిపోయా డతను. తేరుకుని ఆ కవర్లో మరోసారి చూస్తే అతని కో చిన్న చీటీ కనిపించింది. అందులో "ఎవరూ లేని నాకు, నే నుండవలసిన స్థానంలో ఉన్న శ్రీమతి రామ్మోహనే ఆప్తురాలు - ఆమెకే ఈ నా కష్టార్జితం" అని రాసుంది.

అతను ఆఖరు కవర్ని విప్పితే అందులో ఆమె రాసిన వీలునామా ఉంది. దాన్నతను అక్కడక్కడా చదివితే అతనికి మరింత విస్మయమైంది. బొంబాయిలో ఉన్న తన ఇంటిని కృష్ణ పేర రాసుంది. నిజంగా అతనికి మైత్రేయి మనస్తత్వమే అర్థం కాలేదు. ఈ అర్థం లేని పనికి ఆమె మీద అతనికి కోపం కూడా వచ్చింది. తనంటే ఇసుమంతైనా గౌరవం లేని సవితి కొడుకు పేర తన ఇల్లు రాయట మేమిటని ఆశ్చర్యమేసింది. "నా భర్త కొడుకు ఎవరికి పుట్టినా నా కొడుకే అందుకే ఈ ఇల్లు వాడికే" అన్న ఒక చీటీ ఉంది ఆ కవర్లో. అర్థం లేని వాదం అనిపించింది అతనికి.

** ** **

హాస్పిటల్ వాళ్ళు శవాన్ని అప్పజెప్పేసరికి సాయంత్రమైంది. అంతకు ముందే చెప్పి ఉంచడంతో శవం శ్మశానం చేరేసరికి అక్కడన్నీ సిద్ధంగా ఉన్నాయి. ఆమె చితికి తానే చిచ్చు పెట్టక తప్పలేదు అతనికి. ఒక విధంగా మైత్రేయి ఇప్పు డొక అనాథే.

"అనాథ ప్రేత సంస్కారే కోటి యజ్ఞఫలంభవేత్" అని మనసులోనే అనుకుని చితికి నిప్పంటించాడు. చితిలోంచి లేచే మంటలు అధికమై పై పైకి లేస్తుంటే వాటిల్లోంచి వస్తున్న నల్లని పొగ అతన్ని చుట్టేసింది. నాలికలు చాచుకుని పై కెగస్తున్న మంటలకు మైత్రేయి శరీరం ఆహుతి అయిపోతుంటే తన చేతులతో ఆమెను తనే స్వయంగా పంచభూతాలకు అప్పగిస్తూన్న అనుభూతి కలిగిం దతనికి.

బ్రతికినన్ని రోజులూ మైత్రేయి ఒక రంగు బొంగరంలా తిరిగింది. ఒక చోట నుంచి మరో చోటకు పిచ్చిదానిలా పరుగెత్తింది. పరుగెత్తి పరుగెత్తి అలసిపోయి ఒకచోట కూచున్న తర్వాత మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చినదానిలా మళ్ళీ పరుగెత్తేది. ఏదో ఒక మూలన తన పనేదో మిగిలిపోయినట్టూ, తన కోసం ఎవరో ఎక్కడో ఎదురు చూస్తున్నట్టూ భ్రమపడేది. ఇలా తిరిగి తిరిగి ఆ రంగుల బొంగరం కింద పడిపోయింది. ఇప్పుడు ఈ చితికి ఆహుతైపోతోంది. పంచభూతాల్లోంచి వచ్చిన శరీరం మళ్ళీ పంచభూతాల్లోనే కలిసిపోతోంది.

రామ్మోహన్ ఆమె వస్తువుల్ని ఒక్కొక్కదాన్నే తీసి ఆ చితిలో వేయటం మొదలుపెట్టాడు. ఒకదాని తర్వాత మరొక వస్తువును చితిలో పడేస్తున్న రామ్మోహన్ చేతికి మైత్రేయి డైరీ అందింది. దాన్ని అందులో పడేయబోయి యాథాలాపంగా దాన్ని తెరిచి చూశాడు. ఒకచోట "నేను జీవితంలో చేసిన అతి పెద్ద తప్పిదం రామ్మోహన్‌ని కాదనడం" అని ఉంది. కొన్ని పేజీలు తిరగేస్తే అక్కడ "ఎంత వద్దనుకున్నా ఈ రోజు రామ్మోహన్ జ్ఞాపక మొస్తున్నాడు" అని, మరోచోట ""... పార్వతే దేవదాసు దగ్గరకు వెడితే?" అని ఉంది.

ఇలా తను ఆమె డైరీని చదవటం అతనికే నచ్చలేదు. ఆమె జీవితంలో ఏ కొద్ది కాలమో తప్ప ఆమె బాగోగుల్ని గురించి తనెప్పుడూ పట్టించుకోలేదు. అస లామె ఎక్కడున్నదీ తనకు తెలియదు. మరిప్పుడు ఈ డైరీ చదివి ఆమె రహస్య జీవితంలోకి తొంగి చూసే హక్కు తన కెక్కడిది? లేదు... తన కా హక్కు లేదు. ఈ డైరీని ఉంచుకునే అధికారమూ తనకు లేదు - అని అనుకుని మండుతున్న ఆ చితిలోకి దాన్ని జార విడిచాడు.

తర్వాత కరెన్సీ నోట్ల కట్టలున్న కవరు అందుకుని "నా భార్య పేరిట మైత్రేయి ఇంత డబ్బు వదలటం విడ్డూరమే! అసలు మైత్రేయి అనే స్త్రీ ఒకామె ఉందని ఆమెకు తెలియదు. మంచికి గాని, చెడుకుగానీ మైత్రేయి జీవితంలో నా భార్య ప్రమేయం లేనే లేదు. అయాచితంగా ఇంత డబ్బు ఆమె నా భార్య కివ్వటం అపాత్ర దానమే అవుతుంది. అలాంటి దానమివ్వటం, తీసుకోవటం కూడా అధర్మమే. ఈ అధర్మానికి నేను భాగస్వామి నెందుకవ్వాలి? అసలు ఈ డబ్బును అనుభవించడానికి ఎవ్వరూ అర్హులు కారు' అనే నిర్ణయానికి వచ్చాడు.

చివరి కవర్ని అందుకుని 'ఈ వీలునామా ఒరిజినల్ ఏ లాయరు దగ్గరైనా ఉంటే ఉండవచ్చు. కాని బొంబాయిలో ఇంటినే కాదు, మైత్రేయ సంపాదించిన పూచికపుల్ల కూడా పొందటానికి కృష్ణ అర్హుడు కాడు. ఆ కుర్రాడికి మైత్రేయి మీద కోపం ఆమె తన సవతి తల్లి అవటం వల్లే. ఆమె చనిపోతే మానవత్వపు విలువల్ని మన్నించైనా ఆమె దహన సంస్కారాలు చేసి ఉండవలసింది. కాని మూర్ఖంగా నే నన్న ప్రతి మాటనూ వ్యతిరేకించి నాతో రావడానికి నిరాకరించాడు. చదువుకుని సంస్కారవంతుడైన గుణా లేవీ కనిపించలే దతనిలో. ఇంత అనాగరికంగా ప్రవర్తించిన వాడికి ఈమె కష్టించి సంపాదించిన ఫలాన్ని అనుభవించే అర్హత లేదు. నామటుకు నే నీ వీలునామా లేనట్టే భావిస్తాను" అని దాన్ని తునకలు చేసి చితిలో పడేశాడు.

ఈ తతంగం అంతా పూర్తయి వెనుదిరిగి దూరంగా ఆగిన తన కారు వైపు నడుస్తున్న రామ్మోహన్‌కి చప్పున ఒక సత్యం తెలిసొచ్చింది. ఏమంటే తన జీవితంతో ఇంతకాలం మరొకరి జీవితం ముడిపడి ఉందని ఇప్పుడే తెలిసింది తనకు. కాని తెలిసిన మరుక్షణంలో ఆ జీవి లేకుండా పోయింది. ఇదెంత విషాదం! ఇహ జీవితాంతం త నీ విషాదంతోనే బ్రతకాలి!! ★

